

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సభాభవన్‌లో సోమవారం నిర్వహించనున్నామని డిఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీప పంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవ లను వినియోగించుకోవాలని డిఆర్‌ఓ. ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబం ధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తుపాన్ జాబితాలో కడప జిల్లాను చేర్చాలి

ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి



దెబ్బతిన్న చామంతి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

కడప జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో వరి అరటి, మినుము, కంది మొక్కజొన్న, పత్తి, చామంతి పూలు ఇతర వాణిజ్య పంటలు, ఉద్యానవన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లె లో తుఫాను దాటికి దెబ్బతిన్న చామంతి పూల తోటలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తుపాన్ జాబితాలో కడప జిల్లా చేర్చకపోవడం చాలా అన్యాయమని ఆయన తెలిపారు బద్వేల్ రెవెన్యూ డివిజన్లో 8 మండలాలలో తుపాన్ ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. కడప జిల్లాలో కురిసిన అధిక వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి వంటి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న చామంతి పూలు అరటి వరి మొక్కజొన్న పంట, వెన్ను దశలో ఉన్న వరిపంట నేలకొరిగి అపార నష్టం వాటిల్లిందని ఆయన తెలిపారు. దెబ్బతిన్న అన్ని పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే పంటనష్టం గురించి అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులతో బృందాలను వేసి నిస్పక్షపాతంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించాలని అన్నారు. పరిశీలన బృందాలలో అధికారులు, సిబ్బందితోపాటు రైతు సంఘం, కౌలు రైతుసంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే దెబ్బతిన్న అన్ని ఆహార పంటలకు ఎకరాకు రూ. 25 వేలు, వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ. 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, మండల రైతు సంఘం నాయకులు సిద్దయ్య, వెంకటసుబ్బారెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

సాహిత్య సంపద పరిరక్షణ అందరి బాధ్యత

- బ్రౌన్ సేవలు తెలుగుభాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం
- మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

భాషా, సాహిత్య సంపదను భావితరాలకు వారసత్వ సంపదగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఉప రాష్ట్రపతి, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత ఎం. వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం కడప సి.పి.బ్రౌన్ సాహిత్య పరిశోధన గ్రంథాలయాన్ని సందర్శించారు. సిపి బ్రౌన్ భాషాపరిశోధన కేంద్ర గ్రంథాలయ భవనంలోని జనుమద్ది సాహితీ పీఠం, అన్ని విభాగాలను సందర్శించి గ్రంథ పరిమళాన్ని ఆస్వాదించారు. ముందుగా యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రంలో జానుమద్ది సాహితీపీఠం వారి సౌజన్యంతో ప్రతిష్టించిన తెలుగు సూర్యుడు, తెలుగు భాషా సముపార్జకుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఛాయాత్రాలను ఒక్కొక్కటిగా తిలకించారు. గ్రంథాలయంలో నిక్షిప్తం చేసిన అమూల్యమైన, వెలకట్టలేని పురాతన తాళపత్ర గ్రంథ నిధిని, పరిశోధనా గ్రంథాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు బాషా సాహితీ సౌరభంలో మణి దీపంలా వెలుగొందుతున్న సి.పి.బ్రౌన్ భాష పరిశోధనా కేంద్రాన్ని సందర్శించడం తనకు చాలా సంతృప్తినిచ్చిందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రం విస్తరణాభివృద్ధికి, యూనివర్సిటీ భాషా పరిశోధక యంత్రాంగం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆదరణ, ఔన్నత్యాన్ని కోల్పోయే స్థితిలో ఉన్న తెలుగు భాష సాహిత్యాన్ని పునర్లిఖించిన ఆంగ్లేయ సాహితీ శిఖరం 'చార్లెస్ ఫిలిప్ బ్రౌన్' అని, ఆయన సేవలు తెలుగు భాషా సాహితీవేత్తలకు ఆదర్శనీయం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, కలెక్టర్ డాక్టర్. శ్రీధర్ చెరుకూరి, వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్, కేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, శతావధానులు డాక్టర్ మెడసాని మోహన్, రేవూరి అనంత పద్మనాభ, 20 లక్షల పుస్తకాలను సేకరించిన అంకె గౌడ, ఆకాశవాణి పూర్వపు సంచాలకులు, గుమ్మడి గోపాలకృష్ణ, ఎస్‌బిఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ, జానుమద్ది సాహితీపీఠం నిర్వాహకులు, కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, కెఎంసి కమిషనర్ మనోజ్‌రెడ్డి, బ్రౌన్ గ్రంథాలయ సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు డాక్టర్ జి.పార్వతి, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పురస్కారాల ప్రదానోత్సవం

అనంతరం డాక్టర్ జనుమద్ది హనుమచ్చాస్త్రి శత జయంత్యుత్సవం (1925–2025) సందర్భంగా 14వ సాహిత్య, గ్రంథాసల్య సేవా పురస్కారాల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతీర్మయి ప్రతాప, సభ అధ్యక్షులుగాకేంద్ర సాహిత్య ఆకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, గౌరవ అతిథులుగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి హాజరయ్యారు. వారితో వెంకయ్యనాయుడు తెలుగుభాషా ఔన్నత్యం, తెలుగు భాషా తీయదనం, కడప జిల్లా కళా సాహిత్య విశిష్టతను పంచుకున్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే చదిపిరాళ్ళ ఆదినారాయణ రెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, జానుమద్ది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడు చేతులుమీదుగా పుస్తకావిష్కరణ

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సహాయ పరిశోధకుడిగా పనిచేస్తున్న డాక్టర్ చింతకంట శివారెడ్డి రాసిన 'కడపజిల్లా స్వాతంత్ర్య సమరయోధులు, అలనాటి జ్ఞాపకాలు' పుస్తకాన్ని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆదివారం బ్రౌన్ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారి జీవిత చరిత్రలను భద్రపరచడం అవసరమన్నారు. ఇలాంటి పుస్తకాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తాం

- సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి
- రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు పిలుపు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు కాలరాస్తే ఉద్యమిస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తుందని విమర్శించారు. ఈ తరుణంలో నిర్వహించబోయే సిఐటియు 18వ ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్మికుల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, కార్మికుల హక్కులు కాల రాయడం దుర్మార్గమని తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం తానఅంటే, తందాన అంటూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ ఉందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కార్మిక చట్టాలు మార్చటం, 13 గంటలు పని చేయాలని ఆదేశాలు ఇస్తున్నారని విమర్శించారు. వారి శ్రమకు తగిన ఫలితం లేదని తెలిపారు. ముఖ్యంగా ఎనిమిది గంటలు నిద్ర, ఎనిమిది గంటలు శ్రమ, ఇతర పనుల కోసం ఎనిమిది గంటలు చేయాల్సి ఉండగా వాటికి భిన్నంగా ప్రభుత్వం ముందుకు వెళ్లడం దుర్మార్గమని చెప్పారు. కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాల్సి ఉండగా ఎక్కడ అమలు కాలేదని విమర్శించారు. కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి మరి దారుణమని పేర్కొన్నారు. వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటితరంగ కార్మికుల పరిస్థితి మరి ఘోరమని తెలిపారు. విద్య, వైద్యరంగం, విద్యుత్, హమాలీ, విఆర్ఎ మున్సిపల్, రిమ్స్, ఆప్కాస్ ఐఎంఎల్ వారిది ఇదే పరిస్థితి ఉందన్నారు. స్కీం వర్కర్లు, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, ఎన్ హెచ్ఎం, ఇతర అన్ని రకాల ఉద్యోగుల పరిస్థితి మరి దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా చట్టాలు చేయడం అన్యాయమని చెప్పారు. రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని రంగాల కార్మికులు, నాయకులు, కార్యకర్తలు సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 31 నుంచి, 2026 జనవరి 4, వరకు విశాఖపట్నంలో సభలు ఉంటాయని తెలిపారు. జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శులు సత్యనారాయణ, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు బైరవ ప్రసాద్, జి.చంద్రశేఖర్, ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కమిటీ సభ్యులు విజయ్ కుమార్, రాఘవ,సాల్మన్, చంద్రా రెడ్డి, చంటి, రవి, నాగలక్ష్మి, అంజలి దేవి, విజయలక్ష్మి, సుబ్బారెడ్డి, వెంకటపతి, దాసు, సంటమ్మ, ప్రభావతి, కుసుమ, కోటమ్మ, విద్యుత్ రంగాల నాయకులు కొండయ్య, శ్రీనివాసులు, రిమ్స్, వీఆర్ఏ, మున్సిపల్, ఐఎంఎల్, అప్కాస్, ఆటో, బిల్డింగ్ నాయకులు నాగేంద్ర, హరి, వెంకటసుబ్బయ్య, రమణారెడ్డి, శ్రీరామ్, స్టీఫెన్, చాన్‌బాష, గౌస్, ఉదయ్, విజయ్, రామ్మోహన్, శివ, అన్వేష్, దస్తగిరి రెడ్డి, నారాయణరెడ్డి, ఐ.ఎన్. సుబ్బమ్మ, కిరణ్, కార్మికులు పాల్గొన్నారు.

రసవత్తరంగా సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు

డ్రాగా ముగిసిన కడప, కర్నూల్ మ్యాచ్



తలపడుతున్న కడప, కర్నూలు జట్లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ – 14 మల్టీ డే మెన్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తంగా సాగుతోంది. వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కడప కర్నూలు జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 125 పరుగులు చేసింది. రెండు వికెట్ల నష్టానికి 68 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 89.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని తాహిర్ 63, అష్ కాన్ 49 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని యశ్వంత్ సూర్య 3, అంకిత్ పరిక్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 31.0 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టానికి 58 పరుగులు చేసింది. ఆ జట్టులోని రిషి 22 పరుగులు చేశాడు. కడప జట్టులోని ముని నాగేశ్వర్ మూడు వికెట్లు తీసుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో కడప జట్టు ఆదిక్యత సాధించింది.

నెల్లూరు, అనంతపురం మ్యాచ్ డ్రా.. కెఒఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో నెల్లూరు జట్టు 186 పరుగులు చేసింది. మూడు వికెట్ల నష్టానికి 86 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 83.4 ఓవర్లలో 242 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మోక్షజ్ఞ తేజ 84 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని శ్రీ చరణ్ రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు ఆట ముగిసే సమయానికి 45.0 ఓవర్లలో వారు వికెట్లు నష్టానికి 159 పరుగులు చేసింది. ఆ జట్టులోని సమీర్ 59 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని రోహితేశ్వర్ రాజు మూడు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో అనంతపురం జట్టు ఆధిక్యత సాధించింది.

నిర్మల ధర్మపరుడు 'రామమునిరెడ్డి'

ప్రజాశక్తి - కడప అర్బన్ : మారుమూల గ్రామం సామాన్య రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి 1983లో కడప శాసనసభకు పోటీ చేసి అత్యధిక మెజార్టీతో గెలిచి కేవలం 32 సంవత్సరాల వయసులోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన నిగర్వి, నిర్మల ధర్మపరుడు శిరిగిరెడ్డి రామ ముని రెడ్డి అని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ద్వారకా నగర్‌లో ఉన్న శ్రీకృష్ణాలయ సమావేశ మందిరంలో రామ మునిరెడ్డి రచించిన స్వీయ చరిత్ర 'నా స్మృతి పథంలో' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ స్వీయ చరిత్ర రాయడం కత్తి మీద సాము లాంటిదని పేర్కొన్నారు. రామ మునిరెడ్డి చాలా జాగ్రత్తగా రాశారని, ఆయన జీవితంలో ఏదైతే చేశారో అది మాత్రమే రాశారని, నేటి యువతకు ఇలాంటి పుస్తకాలు మార్గదర్శకాలుగా ఉపయోగపడతాయన్నారు. అనంతరం డాక్టర్ విద్వాన్ గానుగపెంటరావు, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ తవ్వా వెంక టయ్య ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ పొదిలి నాగరాజు, భూమిరెడ్డి స్వరూపారాణి, రామ మునిరెడ్డి సతీమణి కందుల లక్ష్మీదేవమ్మ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు, సాహిత్యకారులు, ఆధ్యాత్మిక చింతనాపరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల మంజూరుకు కృషి

ప్రజాశక్తి - కడప




వెంకయ్యనాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న పస్తం అంజి

బేడ బుడగ జంగం కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు వచ్చేలా చూడాలని కడపకు వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును బేడ బుడగ జంగం జిల్లా నాయకులు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పస్తం అంజి కోరారు. ఆర్అండ్‌బి. ఆదివారం గెస్ట్ హౌస్‌లో వెంక య్య నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైసిపి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి బేడా బుడగ జంగం వారికి కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదని, వెంటనే కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని గత రాష్ట్ర క్యాబినెట్ లో తీర్మానించారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తమనుఏ కేటగిరి కింద చేర్చి కేంద్రానికి ముఖ్యమంత్రి నివేదిక పంపించారు అన్నారు. మీరు ప్రధానమంత్రి మోడీతో, రాష్ట్రపతితో మాట్లాడి జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో బేడ బుడగ జంగం కులాన్ని ఎస్‌సిలుగా ఆమోదించి కుల దృవీకరణ పత్రాలు వచ్చే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో కె.లక్ష్మయ్య, వెంకటేష్, శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

కడప శిల్పారామంలో సాంస్కృతిక సందడి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని శిల్పారామం కళావేదికపై ఆదివారం కళాకారులు చేశారు. మిస్స మూవీ పద్మాకర్ వారి సహకారంతో నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ విద్యార్థి విద్యార్థులు పల్లె జాన పదాలు, శాస్త్రీయ నృత్యా లు, సినీ నృత్యాలతో ప్రేక్షకుల అలరించాయి. కార్యక్రమాలను శిల్పారామం పరిపాలన అధికారి ఎస్. కృష్ణ ప్రసాద్ పర్యవేక్షించారు.



నృత్యం చేస్తున్న యువకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దారుణం

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం చాలా దారుణమని వైసిపి మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు గుజ్జల ఈశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరేన్ రామంజులరెడ్డి సూచనల మేరకు బుసిరెడ్డి పల్లెపంచాయతీలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రయివేటీకరణ ఆలోచనను ప్రభుత్వం విరిమించే వరకు వైసిపి పోరాటం చేస్తుందన్నాపరు. కార్యక్రమంలో ఎంపిటిసి వెంకటరెడ్డి,నాయకులు సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, నాగేందర్ రెడ్డి, కమల్, విశ్వనాథరెడ్డి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

'బాలవికాస్' విద్యార్థులకు మెమోంటోలు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : 2025 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన బాలవికాస్ పాఠశాల విద్యార్థులు గౌసియా, నీనా సహన, ప్రదీప్ కుమార్, గీతికా, రిహానా హుస్నాకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మెమోంటోలు ప్రదానం చేశారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో సాధించిన చిత్రకారుడు ఆనందరాజ్‌కి, సాహితీవేత్త గుమ్మడి గోపాలకృష్ణ, అష్ట శతావధాని మెడసాని, రేవూరి అనంత పద్మనాభ అంకె గౌడకు 14వ సాహిత్య గ్రంథాలయ సేవా పురస్కారాలను ప్రదానం చేశారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి పెద్దపీట

విభిన్న ప్రతిభావంతుల, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఆర్.వి.కృష్ణకిశోర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



సమాజంలో చిన్నచూపును ఎదుర్కొంటున్న విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. విభిన్న ప్రతిభా వంతులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి ట్రైసైకి ళ్లు పంపిణీ చేయడం దగ్గర నుంచి ఆర్థికంగా ఇతరులపై ఆధార పడటాన్ని తగ్గించడానికి ఉద్దేశించి బ్యాంకు రుణాలు, వైకల్యం ఆధా రంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా, వికలాంగ పింఛన్లు మంజూరు చేయడం వంటి విధానాలతో ముందుకెళు న్నామని పేర్కొంటున్న విభిన్నప్రతిభావంతుల, వృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి ఆర్.వి కృష్ణకిషోర్‌తో ముఖాముఖి..

ముఖా ముఖి..

విభిన్నప్రతిభావంతుల సంక్షేమాన్ని గురించి వివరించండి?

విభిన్నప్రతిభావంతుల సంక్షేమానికి కృషి జరుగుతోంది. 2022 నుంచి 2026 వరకు రూ.1.60,00, 000 విలువ కలిగిన ఉప కరణాలు మంజూరు చేశాం. రూ.6.02 లక్షలతో 110 మందికి ట్రైకిళ్లు, రూ.3.90 లక్షలతో 78 మందికి వినికిడి యంత్రాలు, 0.52 లక్షలతో చంకకర్రలు, రూ.8.40లక్షలతో లాప్‌టాప్‌లు, రూ.3.78 లక్షలతో తోపుడుబండ్లు, రూ.40లక్షలతో 144 మందికి కృత్రిమ అవయవాలు, రూ.2.10 లక్షలతో టచ్‌ఫోన్లు, రూ.1.40 లక్షలతో అంధుల టచ్‌ప్లేయర్స్ వెరసి రూ. 66.12 లక్షలతో 496 మందిని ఆదుకునే ప్రయత్నం చేశాం.

స్కాలర్‌షిప్పులు మంజూరు వివరాలు తెలపండి?

జిల్లాలో 47 మందికి రూ.1,88,000 జాతీయ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్పులను మంజూరు చేయడమైంది. వాటిని తాజాగా రెన్యువల్ చేశాం. 2025–26 సంవత్సరంలో కొత్తగా మరో ఐదుగురికి రూ.20,000 మంజూరు చేయడమైంది. దీంతోపాటు 76 మందికి రూ.9,12,000 జాతీయ పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్పులను రెన్యువల్ చేయడమైంది.వీరితోపాటు 2023–24 సంవత్సరానికి గానూ మరో 10 మందికి కొత్తగా రూ.1,12,000 మంజూరు చేయనున్నాం.

డిడిఆర్‌ఎస్ పథకం పురోగతి ఎలా ఉంది?

రాష్ట్రీయ సేవా సమితి కడప, హెలెన్‌కెల్లర్ కడప, ఆల్‌షిఫా రెసిడెన్షియల్ కడప, రాష్ట్రీయ సేవా సమితి ప్రొద్దుటూరు, దర్శిని హ్యాండిక్రాఫ్ట్ వెల్ఫేర్ సొసైటీ బద్వేల్, ఎన్‌జిఒల సహకారంతో మానసిక, చెవిటి పిల్లల పాఠశాలల్లో 287 మందికి విద్యాబోధన సాగిస్తున్నాం. తాజాగా కడప జిల్లా కేంద్రంలోని సెయింట్ ఆన్స్ కాన్వెంట్ పాఠశాలలో42 మందికి విద్యాబోధన సాగిస్తున్నాం.

ప్రభుత్వ వసతిగృహాల్లో ఎందరు ఉన్నారు?

జిల్లాలో కడపలోని ప్రభుత్వ అంధుల బాలుర హాస్టల్‌లో 100 మంది, ప్రభుత్వ హాస్టల్ ఫర్ డిఫరెంట్ ఏబుల్డ్ గర్ల్స్‌లో 50 మంది చొప్పున ఉన్నారు.

సదరెం కార్డుల వివరాలు తెలపండి?

జిల్లాలో 59,410 మందికి యుడిఐడి సదరెం కార్డులు మారి నవి, 30,185 కార్డులు ముద్రించి పంపిణీ చేయడమైంది. 29,225 మిగిలి ఉన్నాయి. ఇందులో 3,471 దరఖాస్తుల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించాం. 112 దరఖాస్తులు వైద్యబోర్డుల పరిశీలనలో ఉన్నాయి.

వృద్ధుల సంక్షేమం ఎలా ఉంది?

కడప జిల్లాలో వృద్ధుల సంక్షేమం ఆశావహంగానే ఉంటోంది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సంక్షేమాల పెద్దపీట వేయడం జరుగుతోంది. కడప జిల్లాలోని కలసపాడు పద్మావతి మహిళా మండలిలో 25 మంది లబ్ధి పొందుతున్నారు. కడప అక్కాయపల్లిలో అంబేద్కర్ దళిత వర్గ అభివృద్ధి సంఘంలో 50 మంది, లింగాలలో లీలావతి ఛారిటబుల్ ట్రస్ట్‌లో 25 మంది, లారెన్స్‌వీకర్ సెక్షన్ సొసైటీ వల్లూరులో 25 మందితో వసతి గృహాలను పలువురు ఎన్జీఓలు నిర్వహించడం జరుగుతోంది.

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం గురించి చెప్పండి?

జిల్లాలో 189 మంది ట్రాన్స్‌జెండర్లను గుర్తించాం. 18 ఏళ్ల పైబడిన 136 మంది ట్రాన్స్‌జెండర్లకు రూ.4,000 చొప్పున పింఛను మంజూరు చేస్తున్నాం. దీంతోపాటు 156 మంది సర్టిఫికెట్లు, ఐడెం టిటీ కార్డులు మంజూరు, నైపుణ్యాభివృద్ధి, ఇళ్లు, ఇళ్లస్థలాలు మంజూరు చేయడమైంది.

కెవిపిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నియోజకవర్గ కెవిపిఎస్ అధ్యక్షులుగా రాపూరి రామసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇల్లూరి ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో ఎస్‌సి, ఎస్‌టి సమస్యలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. దళిత కాలనీలలో వీధిలైట్లు, రోడ్లు లేవని తెలిపారు. ఎక్కువ మందికి ఇళ్ల స్థలాలు లేవని చెప్పారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్క గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో జనాన్ని సమీకరించి కెవిపిఎస్ ఆధ్వర్యంలో తహశీల్దార్, ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జకరయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

భేటీ బచావో.. భేటీ పడావో

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్‌ఎల్ యూనిట్ 9 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం చితలమడుగుపల్లెలో భేటీ బచావో, భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు రక్షణ విద్యకు ప్రాధాన్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతి బాలికకు విద్యా హక్కు, భద్రత, సమాన అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని, బాలికలు చదువుకుంటే దేశం అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. పోస్టర్ క్యాంపెయిన్లు, ర్యాలీలతో విధుల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వాలంటీర్స్ గ్రామంలో ఉన్న ప్రతి గడప గడపకి వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యోగ అనేది శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను సాధించడానికి ఉపయోగపడే ప్రాచీన భారతీయ సాధన అన్నారు.

నేడు డయల్ యువర్ సిఎండి

ప్రజాశక్తి - కడప

ఎపిఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో మొట్టమొదటిసారిగా డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల వినియోగదారులు 8977716661కు ఫోన్ చేసి తమ విద్యుత్ సమస్యలను నేరుగా సిఎండి దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10:00 నుంచి 12:00 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు. వినియోగదారులు 9133331912కు చాట్ చేయడం ద్వారా కూడా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చుని తెలిపారు.

సిఐ బాల మద్దిలేటికి సన్మానం

ప్రజాశక్తి - కడప : సికె దిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఇటీవల సిఐగా బాధ్యతలు చేపట్టిన బాల మద్దిలేటిని ఆదివారం కృపా కాలనీకి చెందిన న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, ఆయన కుమారుడు పి. రవితేజ, బుడగజంగం ప్రెసిడెంట్ డి. శ్రీరాములు, డి.రాజు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ కడప జిల్లా మతసామరస్యతకు ప్రతీకగా నిలిచిందని ఈ ప్రాంతంలో మత సంబంధమైన ఘర్షణలు జరగకుండా చొరవ చూపాలని సిఐని కోరారు. సిఐ మాట్లాడుతూ పాస్టర్ మహేష్ కుటుంబం నిరంతరం దైవ సేవతోపాటు సమాజ సేవలు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డి.రాజు, డి.శ్రీరాములు, పి.రవితేజ పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరంలో వైద్యులు, ప్రజలు

కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కంటి చూపు అనేది భవిష్యత్తుకు భరోసా లాంటిదని, ప్రతి ఒక్కరూ కంటి చూపుపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి, దాన్ని కాపాడుకోవాలని వైవియూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక శిబిరంలో ఆదివారం తగేండుపల్లె గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆప్తమాలజిస్ట్ హరిత, డాక్టర్ ఈషా 80 మంది ప్రజలకు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తగు సూచనలిచ్చారు. ఉచిత వైద్య శిబిరాన్ని వైవియు ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వెంకట్రామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన పరిస్థితులపై అధ్యయనం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ప్రొగ్రాం డిప్యూటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజగోపాల్‌రెడ్డి, విజయలక్ష్మి, అంగన్వాడీ ఆయా నాగలక్ష్మి, వాలంటీర్లు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న వరుస దొంగతనాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇటీవల కాలంలో ప్రొద్దుటూరు బంగారు అంగళ్ల సమీపంలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో బంగారు వ్యాపారస్తులు బెంబేలెత్తుతున్నారు. శనివారం మహేష్ అను బంగారు వ్యాపారి దుకాణంలో చోరీ జరిగింది. 50 గ్రాముల బంగారు, రూ.50వేలు నగదు, వెండి చోరీ అయింది. ఆగస్టు 19న డీజీఎం అంగట్లో 20 తులాల బంగారు చోరీ అయింది. ఈ రెండు చోరీలు కూడా మధ్యాహ్నం సమయంలోనే జరగడం.. చోరీ జరిగిన తీరు కూడా ఒకే విధంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. షట్టర్ వేసింది వేసినట్లుగానే ఉండడం, అంగడి లోపలి పెట్టె తెరిచి చోరీకి పాల్పడడం ఒకే తీరుగా కనిపిస్తోంది. ఈ రెండు చోరీలకు ఒకే వ్యక్తి పాల్పడినట్లుగా సీసీ పుటేజ్ ద్వారా తెలుస్తోంది. వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. కొను గోలుదారుడు లాగానే అంగడిలోకి వచ్చి అన్ని క్షుణ్ణంగా పరిశీలించి చోరీ చేస్తున్నట్లుగా వ్యాపారస్తులు అనుమానిస్తున్నారు. అధిక ధరల వల్ల వ్యాపారం తగ్గుముఖం పట్టిందని, ఈ సమయంలో ఈ చోరీలు జరగడం తమకు కోలుకోలేని దెబ్బ అని వ్యాపారస్తులు భావిస్తున్నారు. చోరీలపై వన్‌టౌన్ సీఐ తిమ్మారెడ్డిని ఫోన్ ద్వారా సంప్రదించగా దొంగతనాలపై నిఘా పెట్టామన్నారు. వ్యాపారస్తులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



సైకాలజిస్ట్ సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న చక్రపాణిరెడ్డి

విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదు

ప్రజాశక్తి - వేంపల్లె

పరీక్ష సమయంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయరాదని సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. స్థానిక శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను సాధించడానికి కలలు, కృషి, బాధ్యత, నిబద్ధత చాలా ముఖ్యమన్నారు. రాబోయే 2025-26 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి కఠినమైన శ్రమ తీసుకోవాలన్నారు. ప్రణాళిక బద్ధంగా చదువు కోవాలని కోరారు. సమాజంలో ఉన్న అజ్ఞానాన్ని తొల గించడానికి విద్య చాలా అవసరమన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి క్షణాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతికి తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషి అభినం దనీయమన్నారు. అనంతరం పాఠశాల తరుపున సైకాలజిస్ట్ సుబ్రహ్మణ్యంను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, శ్రీచైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

కార్తికమాసం సందర్భంగా ప్రతి సోమవారం మైదుకూరు ఆర్‌టిసి డిపో నుంచి ప్రత్యేక సర్వీసు నడుపునట్లు డిఎం శ్రీలత ఒక ప్రకటనలో తెలి పారు. సూపర్ లగ్జరీ సర్వీసు మైదుకూరు నుండి ఉదయం 6:15 నిమిషాలకు బయలుదేరుతుందన్నారు. మళ్లీ మధ్యాహ్నం శ్రీశైలం నుండి 1.50 నిమిషాలకు బయలుదేరుతుందన్నారు. జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



మఠంలో నిర్వహిస్తున్న కలశోస్తవం

వైభవంగా కలశస్థాపన మహోత్సవం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి 417వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామికి కలశస్థాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పూర్వపు పీఠాధిపతి కుమారులు శ్రీవెంకటాద్రి స్వామి, వీరభద్రయ్య స్వామి, వీరం బొట్లయ్య స్వామి, దత్తాత్రేయ స్వాములు పెద్దఎత్తున మహిళలు కలశాలతో నడుచుకుంటూ స్వామి వారి మఠం నుండి పార్కులో ఉన్న స్వామి వారి విగ్రహానికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు తిలకించారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి తమిళనాడు ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ట్రస్ట్ అధ్యక్షుడు జయరామన్, సెక్రెటరీ రవిచంద్రన్, ట్రెజరీ సుందరం, కమిటీ సభ్యుల సాయంతో ప్రతి ఏడాది ఇక్కడ అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.



అన్నదానం చేస్తున్న తమిళనాడు వాసులు

మొంథా తుపాన్‌తో దెబ్బతిన్న వంతెనలు

అల్లాడుపల్లె వద్ద వంతెనపై నిలిపేసిన రాకపోకలు

ప్రజాశక్తి - చాపాడు

పది రోజులపాటు ఎడతెరిపి లేకుండా పడిన వర్షానికి కుందూ ప్రవాహం పోటెత్తడంతో మండల పరిధిలోని అన్నవరం, అల్లాడుపల్లె వంతె నలు దెబ్బతిన్నాయి. అన్న వరం వంతెనపై పలు ప్రదేశాల్లో సిమెంట్ లైనింగ్ దిమ్మెలు నదిలో పడిపోయాయి. దీనిపై మ దూరు, అన్నవరం గ్రామాల మీదుగా గుడ పాడు, ప్రొద్దుటూరు వివిధ గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అల్లాడుపల్లె, సీతారామ పురం గ్రామాల మధ్య వంతెన వరద తాకిడీకి రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. రెండేళ్ల క్రితం ఈ వంతెన దెబ్బతినడంతో మరమ్మతులు చేప ట్టారు. ప్రస్తుతం వంతెన దెబ్బతినడంతో రాకపో కలకు ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గాన అల్లాడుపల్లె, చిన్న గురు వలూరు ప్రజలు ప్రయాణిస్తుంటారు. వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వరద తాకిడీకి చాలా ప్రదేశాల్లో భూములు కోతకు గురయ్యాయి. కొన్నేళ్లుగా కుందూ నది వెంబడి కరకట్టల ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నా.. నిధులు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా కోతకు గురవుతున్న ప్రదేశాల్లో కరకట్టల ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. సీతారామాపురం వంతెన వద్ద ప్రజలు ఎవరూ ప్రయాణించకుండా రాకపోకలు నిలిపివేశారు.



అల్లాడుపల్లె వద్ద దెబ్బతిన్న వంతెన

రాయితీ శనగలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

రాగిమానిపల్లి రైతు సేవా కేంద్రంలో ఎంపిటిసి విశ్వనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు రాయితీ శనగ విత్తనాలను ఆదివారం ఎఒ చెన్నారెడ్డి ఆధ్వ ర్యంలో పంపిణీ చేశారు. శనగ విత్తనాల నాణ్యతను రైతుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ పులివెందుల మం డలానికి 500 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు కాగా, అందులో 282 క్వింటాళ్లకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మం డలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఆదివారం, సోమవారంలోపు పంపిణీ పూర్తి చేస్తామన్నారు. శనగ సాగు చేసే రైతులు విత్తే ముందు విత్తనశుద్ధి తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు. విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లనే కాకుండా భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లను కూడా అరికట్టవచ్చని తెలిపారు. అనంతరం ఎర్రిపల్లె గ్రామంలో శనగ విత్త నాల నాణ్యతను పరిశీలించి, రైతులకు పంపిణీ చేశారు. రైతు సేవ కేంద్రం సిబ్బంది శివ ప్రసన్న, అనూష, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : రాయితీతో ప్రభుత్వం అందిస్తున్న శనగలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఎఇఒ భార్గవ్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని గురిజాల, సింహాద్రిపురం గ్రామాల్లో రాయితీ శనగలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురిజాల రైతు సేవ కేంద్రం అసిస్టెంట్ రాజీవ్ పాల్గొన్నారు.



సింహాద్రిపురం : శనగలను పంపిణీ చేస్తున్న ఎఇఒ భార్గవ్‌రెడ్డి

విద్యార్థుల పట్ల చిన్నచూపు తగదు

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు-వార్డెన్‌పై ఆగ్రహించిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విద్యార్థులపై చిన్నచూపు తగదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని ఎస్టీ బాలికల, ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తమ మెనూ ప్రకారం ఆహారం అందిం చలేదని, తక్కువ మోతాదులో పెడుతున్నారని, తాగునీరు కూడా మంచిగా లేవని విద్యార్థులు ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ విద్యార్థులపై చిన్నచూపు ఎందుకని ఎస్టీ హాస్టల్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ వసతి, వంట గదులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు మంచి ఆహారాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతుంటే అధికారులు మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మైసూరారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు భరోసా సిఎం సహాయ నిధి

పేదలకు భరోసా సిఎం సహాయ నిధి అని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో 40 మంది లబ్ధిదారులకు రూ.46 లక్షల సిఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవ లు అందిస్తూ ప్రభుత్వం ప్రజలపై భారాన్ని తగ్గిస్తోందన్నారు. సంక్షేమ పథ కాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వం లక్ష్యమ న్నారు. సహాయ నిధి పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోపూరి దేవస్థానం చైర్మన్ ఓబుల్‌రెడ్డి రమణారెడ్డి, కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జ మైసూరారెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, జ్ఞానేశ్వర్ నాయుడు, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు కృషి



జగన్నాథరెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలో అర్హులైన వారందరికీ కూటమి ప్రభుత్వం తరపున ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు కృషి చేస్తానని రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్న రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డిని, టిడిపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డిని టిడిపి నేత అహమ్మద్ అలీ (సెట్) ఆధ్వర్యంలోనే ముస్లింలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు ఆత్మీయంగా తనను సన్మా నించడం సంతోషకరంగా ఉందన్నారు. గత ప్రభుత్వ పాలనలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణాలు మంజూరు కాని వారందరికీ పక్కా ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. టిడిపి పాలనలోనే చాలామంది గతంలో కూడా సొంత ఇంటి కలను నేర వేర్చుకున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేత అహమ్మద్ అలీ (సెట్), మైనారిటీ ముస్లింలు గౌస్, మస్తాన్ వల్లి, షబ్బీర్ బాషా, రెడ్డి బాషా, గౌస్‌పీర్, జిలాన్ బాషా, పద్మ యశ్వంత్, ముజీబ్, సలీం బాషా, సుందరయ్య, మహీర్, పవన్, అబ్దుల్ రియాజ్, ఆరిఫ్, మౌలా, మహమ్మద్, బాలకృష్ణ, ఆల్ఫాన్ వల్లి, పండు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కె అసిస్టెంట్‌పై పోలీసులకు ఫిర్యాదు

శనగల కోసం నగదు చెల్లించిన రైతుల వివరాలు సేకరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని అంకాలమ్మ గూడూరు రైతు సేవా కేంద్రం అసి స్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై వ్యవసాయ శాఖ అధికారులు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఆదివారం ముద్దనూరు వ్యవసాయ శాఖ ఎడి రామ్మో హన్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి ఎఒ రామాంజనే యరెడ్డి, వ్యవసాయ సిబ్బంది ఫిర్యాదు చేశారు. అనంతరం ఎడి మాట్లా డుతూ అంకాలమ్మ గూడూరు రైతు సేవా కేంద్రం పరిధిలో 124 క్విం టాళ్ల శనగలకు సంబంధించి రైతుల వివరాలు నమోదు చేశారన్నారు. ఇం దుకు సంబంధించి రూ.7.24 లక్షలు రైతు సేవా కేంద్రం అసిస్టెంట్‌కు రైతులు చెల్లించారన్నారు. ఆ నగదును ఏపీ సీడ్స్‌కు చెల్లించకుండా అతను పరార య్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. శనగల కోసం నగదు చెల్లించిన రైతులకు త్వరలోనే వారి వివరాలను సేకరించి విత్తనాలను అందించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకో వాల్సిందిగా పోలీసులను కోరామన్నారు. ఎంపిడిఒ శ్రీనివాసులరెడ్డి, వ్యవ సాయ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు విచారిస్తున్నారు.

తాగునీటి మోటారు చెంత.. అపరిశుభ్రత చింత

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని సర్వన్‌ఖాన్‌పేటలో తాగునీటి మోటారు వద్ద అపరిశుభ్రత తాండవిస్తోంది. స్థానికులు ఇంట్లోని వ్యర్థాలన్నీ మోటారు వద్ద పడేస్తూ పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారు. పందులు అక్కడ చేరి మరింత అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. మోటార్ వద్ద పరిసరాలు చాలా అధ్వానంగా ఉన్నాయి. తాగునీరు కలుషితం అవుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. పారిశుధ్యంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు ఏమాత్రం పట్టిం చుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి సమస్యల పట్ల పెద్దగా దృష్టి పెట్టడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగు చర్యలు చేపట్టి పరిసరాలను శుభ్రం చేయించి సురక్షిత మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మోటారు వద్ద సంచరిస్తున్న పందులు



మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

కాశీబుగ్గ మరణాలను సిఎం దాటవేయడం దురదృష్టకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

శనివారం జరిగిన కాశీబుగ్గ మరణాలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మరణాలపై సిఎం చంద్రబాబు సులభంగా దాటవేయడం దురదృష్టకరమన్నారు. శనివారం ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వస్తారని ఏర్పాట్లు చేయకపోవడం ఖచ్చితంగా ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. ఈ సంఘటనలో 9 మంది చనిపోవడం బాధాకరమన్నారు. దీనిపై మంత్రులు మాత్రం తమకు సంబంధం లేదని మాట్లాడడం అన్యాయమన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఈ ఆలయం లేనంత మాత్రాన ప్రభుత్వం శ్రద్ధ తీసుకోదా అని రాచమల్లు ప్రశ్నించారు. మొన్న తిరుమలలో, నిన్న సింహాచలం అప్పన్న సన్నిధిలో, నేడు కాశీబుగ్గలో అని పేర్కొన్నారు. వైసిపి నాయకులు పరామర్శకు వెళితే బయటకు పంపేయడం ఏంటని ప్రశ్నించారు. పలాస ఆసుపత్రి మొత్తం కూటమి అధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. మొంథా తుపాను ఆపిన పెద్దమనిషి ఈ మరణాలను ఆపలేకపోవడం ప్రశ్నించారు. మృతుల ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. జగన్ నాయకత్వంలో కరోనాను నియం త్రించామని రాచమల్లు గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ ఆగిపోవడం వల్ల రోగులు దిక్కు లేకుండా పోయారని తెలిపారు. కాశీబుగ్గ మరణాలకు స్పందిస్తూ హోం మంత్రి రాజీనామా చేయాలని, సిఎం క్షమాపణ చెప్పాలని రాచమల్లు పేర్కొన్నారు.



కోటి సంతకాల సేకరణలో జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పిపిపి విధానంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తూ కోటి సంతకాలతోనే వాటిని కాపాడుకోవాలని జడ్పిటిసి రవికుమార్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైసిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీ రోడ్డులో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్య అనేది పేదలకు అందని ద్రాక్షలా కూటమి ప్రభుత్వం తయారు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి బుద్ధి వచ్చేందుకు ప్రజలందరూ సంతకాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నేతలు రామచంద్రారెడ్డి, కమతం రాజా, ప్రసాద్, రాజా, గాతాల శ్రీను, ఓబులేసు, రవిశంకర్ గౌడ్, బ్రహ్మయ్య, ముత్యాల ఆంజనేయులు, సులేమాన్, గణేష్, బిఎస్ షేక్షావలి, బండల షకూర్, నరసింహ గౌడ పాల్గొన్నారు.



బి.మఠం : కోటి సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

బ్రహ్మంగారి మఠం : మెడికల్ కళా శాలలను ప్రయివేట్ పరం చేయ డాన్ని నిరసిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ఆది వారం మండల వైసిపి నాయ కులు కార్యక్రమాన్ని చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి పిలుపుమేరకు మైదు కూరు మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి సూచనల మేరకు నాయకులు గ్రామాల్లో సంతకాల సేకరణ నిర్వహిస్తున్నారు.

50 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, ఖాజీపేట, దువ్వూరు, చాపాడు, వనిపెంట సెక్షన్‌లలో విద్యుత్ వినియోగదారులు తాము ఇంటి అవసరానికి వాడుతున్న సర్వీసు మీద ఉన్న అదనపు లోడును 50 శాతం రాయితీతో డిసెంబరు 31లోపు క్రమబద్ధీకరించుకోవాలని సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. జూలై 31తో ముగిసిన ఈ సౌలభ్యం ప్రజలకు మరికొంత కాలం అందుబాటులోకి ఉండాలన్న ఉద్దేశ్యంతో డిసెంబరు వరకు పొడి గించామన్నారు. ప్రజలు గమనించి ఆయా గ్రామానికి సంబంధించిన విద్యుత్ ఎఇని వెంటనే సంప్రదించాలన్నారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలన్నారు. వినియోగదారులకు గడచిన నెల మొదటి వారంలో ఇచ్చిన విద్యుత్ బిల్లుల చెల్లింపులకు అక్టోబర్-31తో గడువు ముగిసినందున ప్రజలు గమనించి సోమ వారం నుండి చెల్లింపులు చేయాలన్నారు. ఆలస్యం చేస్తే రోజుకు అపరాధ రుసుం వడ్డీతోపాటు సిబ్బంది విద్యుత్ సరఫరా తొలగించే అవకాశం ఉం దన్నారు. బకాయిలు ఉన్న ఎస్సీ, ఎస్టీ కాలనీల వినియోగదారులు తప్పక విద్యుత్ ఛార్జీలు చెల్లించాలని ఆయన కోరారు.

జిల్లాస్థాయికి విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మైదుకూరులో జరిగిన డివిజన్ స్థాయి షాట్‌పుట్, లాంగ్‌జంప్ పోటీల్లో మండలంలోని మల్లెపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు భరత్ కుమార్, ప్రణీత, హరిత, శ్వేత జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, స్కూల్ అసిస్టెంట్ సోమిరెడ్డిపల్లె ప్రవీణ్ (ఫిజికల్ సైన్స్), రాయపాటి పాపయ్య (సోషల్) తదితర ఉపాధ్యాయ బందం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాపయ్య, ప్రవీణ్ లతో పాటు గత పిఈటి విజయవాణి ప్రస్తుత పీడి శ్రీకాంత్ రెడ్డి సహకారంతో తాము జిల్లా స్థాయికి ఎంపికయ్యామన్నారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు